ప్రజాశక్తి
సోమవారం 20 నవంబర్ 2023
5
విజయనగరం

ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో జాయింట్ ఖాతాలకు అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద ఆర్థిక సహాయం కోసం విద్యార్థులు, వారి తల్లుల పేరుతో సంయుక్త బ్యాంకు ఖాతాలను జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో ఎక్కడైనా తెరవవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. అన్ని బ్యాంకులు జీరో బేస్డ్ ఖాతాలను తెరిచేందుకు అంగీకరించాయని చెప్పారు. అందువల్ల విద్యార్థులు, వారి తల్లులు ఎపిజివిబి, డిసిసిబి సహా ఇతర బ్యాంకుల్లో ఎక్కడైనా తమ ఖాతాలు తెరచి పాస్‌బుక్ పొందవచ్చని పేర్కొన్నారు.

దర్జాగా ఇసుక దందా

రెండు ట్రాక్టర్లు అప్పగింత

నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలతో నష్టాన్ని గుర్తించిన రైతులు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నడుం బిగించారు. నెల రోజుల క్రితం నదిలో ఇసుక తవ్వుతున్న మూడు ఇసుక ట్రాక్టర్లను రైతులు పట్టుకున్నారు. అందులో ఒక డ్రైవర్ రైతులపైకి ట్రాక్టర్‌తో దూసుకెళ్లి తప్పించుకుని వెళ్లిపోయాడు. రెండు ట్రాక్టర్లను పట్టుకుని రెవెన్యూ అధికారులకు రైతులు అప్పగించారు. వాల్టా చట్టం ప్రకారం ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు.

బొబ్బిలి మండలం వేగావతి నది పరివాహక గ్రామమైన పెంటలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను రైతులు అడ్డుకుంటున్నా ఏమాత్రమూ వెనక్కి తగ్గడం లేదు. రాత్రి సమయాల్లో అడ్డగోలుగా నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టి, అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నా, నది పరివాహక ప్రాంతాల్లోని భూములు కోతకు గురవుతున్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. ఇసుక అక్రమ రవాణాలో ఓ విఆర్ఓ హస్తం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తుడు

- పెంటలో రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- రోజుకు 80కుపైగా ట్రాక్టర్ లోడ్ల తరలింపు
- రాత్రివేళల్లో అక్రమ రవాణా
- దందాకు విఆర్ఒ సహకారం?
- అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి
- దాడులకు వెనుకాడుతున్న యంత్రాంగం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పెంట గ్రామం ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. గ్రామ సమీపంలోని వేగావతి నది నుంచి రాత్రి సమయాల్లో అదే గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన కొందరు ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. రోజుకు సుమారు 80 వరకు ట్రాక్టర్ల లోడు ఇసుకను విక్రయిస్తున్నారు. నదిలో ఇసుకను అక్రమంగా తవ్వి గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పరిశ్రమ, ప్రభుత్వ అభివృద్ధి పనులు, ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వం గ్రోత్ సెంటర్లో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసింది. అక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.2500 వరకు ధర పలకడంతో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి, రూ.1500కే సరఫరా చేయడంతో నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యాజమాన్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ వద్ద కొనుగోలు చేయడం లేదు. ఇసుక అక్రమ రవాణాదారుల వద్ద కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేయొద్దని అధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది.

భూగర్భజలాలపై ప్రభావం

వేగావతి నది ఆధారంగా పెంట గ్రామస్తులకు తాగునీరు అందుతోంది. ఆ నది ఆధారంగానే వ్యవసాయ బోర్లు వేసి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 1500 ఎకరాలకు సాగునీటి బోర్లే ఆధారం. గత కొన్నేళ్లుగా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీరు, సాగునీరు కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు పంట భూములు కోతకు గురికావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నదిలో పెద్ద గోతులు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పిక్నిక్ సీజన్ కావడంతో గోతుల్లో నీరు చేరి ఆయా గోతుల్లో సందర్శకులు దిగితే ప్రాణాలకు ముప్పు తప్పదని చెబుతున్నారు.

మామిడితోటలో అన్‌లోడ్

వేగావతి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలను రైతులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. రైల్వే వంతెన సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంతో రైతులు అడ్డుకునేందుకు వెళ్లారు. ఇసుక లోడ్ చేసిన ట్రాక్టర్లను సమీపంలో ఉన్న మామిడి తోటలో దాచేశారు. తోటలో ట్రాక్టర్లను గుర్తించిన రైతులు వాటిని తీసుకువెళ్లకుండా కాపలా కాసి, విఆర్ఒను తీసుకొచ్చేందుకు ఆయన ఇంటికి ఇద్దరు వెళ్లారు. తొట్టెలో ఉన్న ఇసుకను అన్‌లోడ్ చేయాలని విఆర్ఒ ఇసుకాసురులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ట్రాక్టర్ డ్రైవర్లు అన్‌లోడ్ చేసి ట్రాక్టర్లను తీసుకెళ్లిపోయారు. దీంతో చేసేదేమీ లేక రైతులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ రవాణాకు విఆర్ఒ సహకారం?

ఇసుక అక్రమ రవాణాలో పెంట విఆర్ఒ హస్తం ఉన్నట్లు రైతులు జి.నగిరేష్, జి.త్రినాథ, సిహెచ్ మహందాత, ఎస్.శ్రీను, జి.రమణ ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాపై ఆర్ఐకు ఫోన్ చేయగా విఆర్ఒను పంపిస్తామని ఆయన చెప్పినప్పటికీ విఆర్ఒ ఇసుక అక్రమంగా తవ్వుతున్న ట్రాక్టర్ యజమానులకు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలోనే ఇసుక తవ్వకాలు చేపడుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. సచివాలయ కార్యదర్శికి మామూళ్లు అందడం వల్లే ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణాపై నిఘా

ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెడతామని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వడం నేరమన్నారు. రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దీక్షలకు మద్దతు తెలుపుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

క్షీణిస్తున్న ఆరోగ్యం

- మూడోరోజుకు ఎస్ఎఫ్ఐ నాయకుల నిరవధిక దీక్ష
- పెరుగుతున్న మద్దతు
- స్పందన లేని అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు ఆదివారం మూడో రోజు కొనసాగాయి. దీక్షలు చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకుల ఆరోగ్యం క్షీణిస్తోంది. ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ వచ్చేవరకు దీక్షలు కొనసాగిస్తామని దీక్షా బృందం స్పష్టంచేసింది. ఆందోళన తీవ్రతరం అవుతుందని, దానికి జిల్లా విద్యా శాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి ఆధ్వర్యాన మహిళా విభాగం నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు విద్యా రంగాన్ని నాశనం చేసే విధంగా ఉన్నాయని, వాటిపై విద్యార్థులు ,ఉపాధ్యాయులు కలిసి పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే ఎన్ఇపి పేరుతో పాఠశాలలను మూసేశారని చెప్పారు. అదే సందర్భంలో 2021లో పూర్తికావాల్సిన గిరిజన యూనివర్సిటీ నిర్మాణం ఇప్పటి వరకు కనీసం మొదలు పెట్టకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

దీక్షలకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రాణాలను పణంగా పెట్టి సమస్యల పరిష్కారం కోసం నిరవధిక దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థులందరికీ మేనమామ అని చెప్పుకు తిరిగే జగన్ మోహన్ రెడ్డికి విద్యార్థుల ఆకలి కేకలు పట్టవా? అని నిలదీశారు. సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థులకు తోడుగా కార్మికులు కూడా రోడ్డెక్కాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

దీక్షకు మద్దతు తెలిపిన శ్రామిక మహిళా సంఘం నాయకురాలు బి.సుధారాణి మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థినులకు శానిటరీ నేప్‌కిన్స్ కూడా ఇవ్వలేని ప్రభుత్వం ఉండడం మన దౌర్భాగ్యమన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారుల నుంచి కనీసం స్పందన లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులవి ఏమీ గొంతెమ్మ కోర్కెలు కాదన్నారు.

ఎగ్జిబిషన్ మైదానంలో భారీస్క్రీన్‌పై మ్యాచ్ వీక్షిస్తున్న అభిమానులు

క్రికెట్ సందడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్డే ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం క్రికెట్ సందడి నెలకొంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి మ్యాచ్ ముగిసే వరకు జనాలు టీవీలు, భారీస్క్రీన్లు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు పట్టణాలు, గ్రామాలనే తేడా లేకుండా ఎక్కడికక్కడ ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. నగరంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన భారీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. ఇక్కడికి భారీగా అభిమానులు తరలివచ్చి మ్యాచ్‌ను వీక్షించారు. మొదట ఇండియా బ్యాటింగ్ సమయంలో ఫోర్లు, సిక్సర్లు కొట్టినప్పుడు చప్పట్లు కొట్టి ప్రోత్సహించారు. నగరంలో ఉన్న ప్రధాన హోటళ్లలో స్క్రీన్లు ఏర్పాటు చేసి, ఆఫర్లు పెట్టి వ్యాపారం చేసుకున్నారు. మ్యాచ్‌లో ఇండియా పరాజయం పాలవడంతో క్రికెట్ అభిమానులంతా నిరాశ చెందారు. ఓడినా చివరి వరకు పోరాడిన ఇండియా జట్టును అభినందించారు.

జనవరి 22, 23, 24 తేదీల్లో పోలమాంబ జాతర

ప్రజాశక్తి - మక్కువ

అమ్మవారి పండగ తేదీలను ప్రకటిస్తున్న ఆలయ ఇఒ, ఉత్సవ కమిటీ సభ్యులు

మండలంలోని శంబరలో వేంచేసిన గిరిజన ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారి జాతర జనవరి 22న తోలేళ్లు, 23న సిరిమాను, 24న అంపక ఉత్సవాలను జరపనున్నట్లు దేవాదాయ శాఖ ఇఒ వివిఎస్ నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక చదురుగుడిలో ధర్మకర్తల మండలితో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. జాతర తొలి ఘట్టమైన పెద్దపోలమ్మ సనప చాటింపు డిసెంబర్ 18న ప్రారంభమ వుతుందన్నారు. వచ్చే ఏడాది మార్చి 26 వరకు పది వారాల పాటు జాతర కొనసాగుతుందని తెలిపారు. చండీ హెూమం, మహా అన్నదానంతో జాతర ముగుస్తుందని వెల్లడించారు. అమ్మవారి జాతర ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పూడి దాలినాయుడు, ధర్మకర్తలు అల్లు తిరుపతినాయుడు, పుర్రు చిన్నారావు, యేగిరెడ్డి రాములమ్మ, గొంగాడ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని నగరంలోని రెండో డివిజన్‌లో ఘనంగా నిర్వ హించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, బిసి సెల్ ఛైర్మన్ సిహెచ్ శ్రీనివాస్, చంద్రశేఖర్, చిలక రాజు, సురేష్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ధీరత్వానికి నిదర్శనం ఝాన్సీ లక్ష్మీబాయి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెల్లదొరలను వణికించిన ఝాన్సీలక్ష్మి భాయి వీరత్వాన్ని ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకోవాలని జనసేన నేత గురాన అయ్యలు సూచించారు. ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా జనసేనపార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఝాన్సీలక్ష్మీబాయి స్ఫూర్తితో జనసేన బలంగా పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాటం అశ్విని, పితాల లక్ష్మి, దుప్పాడ జ్యోతి, ఏంటి రాజేష్, ఎల్.రవితేజ, పిడుగు సతీష్, అడబాల వెంకటేష్, ఎం.పవన్ కుమార్, పృథ్వీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎస్‌లో అత్యుత్తమ బోధన

డైరెక్టర్ రామ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సైనిక స్కూల్లో చేరాలనుకునే విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన అందిస్తామని ఎస్‌జిఎస్ సైనిక అకాడమీ డైరెక్టర్ ఎం.రామ్ తెలిపారు. ఆదివారం నగరంలో నూతనంగా ప్రారంభించిన అకాడమీలో విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. అకాడమీ ద్వారా అందిస్తున్న విద్యా బోధన తీరు, వసతి సౌకర్యాల గురించి ఆయన వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తిచేశారు.

ఘనంగా జాప్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) వార్షికోత్సవ వేడుకలను ఆదివారం పట్టణ నిరాశ్రయులు వసతిగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కేక్ కట్‌చేశారు. వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాప్ సభ్యులు మేయర్, డిప్యూటీ మేయర్‌ను సత్కరించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న డెస్క్ జర్నలిస్టు మెట్ట రాజశేఖర్‌కు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు ఎం.రవిచంద్రశేఖర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.వి.ఆర్.గోపాల్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పరుశురాం, వి.గౌరీశంకర్‌రావు, యాగంటి రవి, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసంపద పెంపునకు సమగ్ర ప్రణాళిక

- తాజా చేపల సరఫరానే ప్రభుత్వ లక్ష్యం
- రేగిడిలో రూ.కోటితో ఆక్వాహబ్
- పూసపాటిరేగలో రూ.24.75 కోట్లతో ఫిషింగ్ జెట్టీ
- మత్స్యకారులకు వాహనాలు పంపిణీ
- 3522 మందికి వేట నిషేధభృతి
- 'ప్రజాశక్తి'తో మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి ముఖాముఖి

జిల్లాలో మత్స్య సంపద పెంచడంతోపాటు ఆయా చేపలను తాజాగా వినియోగదారులకు అందజేయడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాకుమారి తెలిపారు. ఇందుకు కోసం ఆక్వాహబ్, ఫిషింగ్ జెట్టీలతోపాటు కోల్డ్‌స్టోరేజీలతో కూడిన వాహనాలను కూడా మత్స్యకారులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఫిష్ ఆంధ్రా షాపులను కూడా జిల్లాలో విరివిగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆమె ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

జిల్లాలో మత్స్య సంపదను ఏ విధంగా పెంచుతున్నారు.?

మత్స్య శాఖ ద్వారా రెండు రూపాల్లో మత్స్య సంపద పెంపునకు కృషి జరుగుతోంది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం (పిఎంఎంఎస్) ద్వారా శాఖా పరంగా గుర్తించిన చెరువుల్లో సీడ్ వేసి, చేపల వృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రెండో పద్ధతిలో మా ఫిష్‌ఫారమ్స్ నుంచి లైసెన్డ్ జలాశయాల్లో చేపపిల్లలను వేసి వృద్ధి చేస్తున్నాం.

ఏయే పథకాల ద్వారా ఎక్కడెక్కడ ఎంత మేర మత్స్య సంపద ఉంది.?

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఈ ఏడాది 16.2 లక్షల చేపలను పెంచుతున్నాం. ఒక్క బొబ్బిలి ప్రాంతంలోనే 4 లక్షల వరకు పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. తాటిపూడి ఫిష్‌ఫారం నుంచి అనకాపల్లి జిల్లా రైవాడ జలాశయానికి 5 లక్షలు, విజయనగరం ఫిష్‌ఫారం నుంచి వెంగళరాయసాగర్‌కు 2 లక్షల ఫిష్‌ఫింగర్స్‌ను తరలించి పెంచుతున్నాం.

మత్స్య సంపద నిల్వకు ఉన్న అవకాశాలు ఏమిటి.?

సముద్రతీరంలో, చెరువులు, జలాశయాల ద్వారా వృద్ధి చెందుతున్న మత్స్య సంపదను సురక్షితంగా నిల్వ చేయడానికి రేగిడి మండల కేంద్రంలో రూ.కోటి వ్యయంతో అధునాతన ఆక్వాహబ్ నిర్మాణం చేపడుతున్నాం. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తికాగానే మొత్తం మత్స్య సంపద అంతా ఇక్కడే నిల్వ ఉంటుంది. ఫిష్ ఆంధ్రా షాపులకు ఇక్కడి నుంచే సరఫరా చేపడతాం.



ఫిష్ ఆంధ్రా దుకాణాలు ఎన్ని ఉన్నాయి? వాటి లక్ష్యం ఏమిటి.?

జిల్లా వ్యాప్తంగా 64 దుకాణాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం. ఇప్పటి వరకు 62 దుకాణాలు ఏర్పాటు చేశాం. ఇందులో అన్ని రకాలైన చేపలు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయి. వినియోగదారులకు ఎక్కడికక్కడ తాజాగా చేపలను అందజేయడమే దీని లక్ష్యం.

చేపల తరలింపునకు వాహన సదుపాయాలు ఎలా ఉన్నాయి.?

ఎప్పటికప్పుడు కోల్డ్ స్టోరేజీలు, లేదా మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా ప్రభుత్వం తరపున ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను మత్స్యకారులకు సబ్సిడీపై అందజేస్తున్నాం. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా 50 ద్విచక్రవాహనాలు అందజేశాం. త్రిచక్రవాహనాలు 2, నాలుగు చక్రాల వాహనాలు మూడు చొప్పున కూడా అర్హులైన మత్స్యకారులకు అందాయి.

వేట నిషేధ సమయంలో నిరుద్యోగ భృతి ఎంత చెల్లిస్తున్నారు.?

మత్స్యకారుల రక్షణ రీత్యా సముద్రంలో ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు వేట నిషేధ సమయం ఉంటుంది. ఈ సమయంలో వారి జీవన భృతి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందుతుంది. ఈ రకంగా 3522 కుటుంబాలకు వేట నిషేధభృతి అందింది.

మత్స్యకార దినోత్సవ ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయి.?

ఏటా నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా తీర ప్రాంతంలో మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో మత్స్యకార కుటుంబాలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నాం.

పూసపాటిరేగ తీరంలో జెట్టీ ఎంతవరకు వచ్చింది.?

సముద్ర మత్స్యసంపదను వెలికి తీసేందుకు అనుగుణంగా పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో రూ.24.75 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ జెట్టీ నిర్మాణాన్ని ప్రభుత్వం తలపెట్టింది. ఇందుకోసం 6 ఎకరాల భూమి కూడా సేకరించాం. గడిచిన ఏప్రిల్‌లోనే సిఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. ప్రముఖ నిర్మాణ సంస్థతో ఎంఒయు కూడా కుదిరింది. త్వరలో పనులు కూడా ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com

సీనియర్ నాయకులతో మాట్లాడుతున్న గొంప కృష్ణ, వెంకటరావు

టిడిపికి పూర్వ వైభవం తీసుకురావాలి

ప్రజాశక్తి - వేపాడ

టిడిపికి గ్రామాల్లో పూర్వ వైభవం తీసుకురావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని గల నల్లబిల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులను ఆయన ఆదివారం ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. మాజీ ఎంపిటిసి రంది మసిలల నాయుడు, బోజంకి నారాయణరావు, రంది నరసింహులను స్వయంగా వారి ఇంటికి వెళ్లి కలిసి పార్టీ పూర్వవైభవానికి కలిసి రావాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎస్‌కోట నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురు వేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడు మరల ముఖ్యమంత్రి కావాలన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏపి పథకాలు అమలు చేస్తారో మేనిఫెస్టోలో ప్రకటించిన కరపత్రాన్ని వారికి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, మండల తెలుగు యువత కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వంగర

ఈ నెల 25న మండల కేంద్రంలో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం మండల-2వ మహాసభలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమణ కోరారు. అరసాడ గ్రామంలో ఆదివారం మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహాసభ రోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు చేసిన అన్యాయంపై, భవిష్యత్తు పోరాటాలపై చర్చిస్తామన్నారు. భవనిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 40 లక్షల భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు సంక్షేమ బోర్డు ద్వారా ఉన్న సంక్షేమాన్ని అనుభవించే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రామ్మూర్తినాయుడు, ఆదినారాయణ, ఆదినాయుడు, అప్పలనాయుడు, రామినాయుడు, రమణ, లక్ష్మణ, త్రినాధ, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణను సత్కరిస్తున్న మాజీ సైనికులు

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకెళ్దామని మాజీ సైనికుల సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు అన్నారు. పాత బొబ్బిలి ఉమా సాయి ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో ఆదివారం వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అత్యవసర ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఖ్యామం కోసం ప్రతిపాదించిన అంశాలపై చర్చించారు. మాజీ సైనికుల కార్యాలయ భవనం నిర్మాణం కోసం కోసం చర్చించారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు పై ఓ మాజీ సైనికుల సంఘం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అలా తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని సూచించారు. సంక్షేమ అధికారి కృష్ణారావు తమ మాజీ సైనికులకు చేసిన సహాయ సహకారాలు గురించి గుర్తిచేశారు. సమావేశ అనంతరం మాజీ సైనికులు బొడ్డేపు రామకృష్ణ 178 సార్లు రక్తదానం చేసిన సందర్భంగా ఆయనను గౌరవ అధ్యక్షుడు సమక్షంలో దుస్సాలోతో సన్మానించి బొకేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డినరీ కెప్టెన్ జీ.పుల్లయ్య, మాజీ సైనికుల హక్కుల పోరాట సమితి జాయింట్ సెక్రెటరీ ఆర్ఎ నాయుడు, ఆర్‌సి రావు, కేజే.నాయుడు విఎన్ శర్మ, ఏ.గోవింద నాయుడు, సత్యనారాయణ, రాజేష్, సత్యారావు, సెక్రటరీ కొల్లి జగన్నాథం సిహెచ్ డేవిడ్, జి.శ్రీనివాస్, బి.ఈశ్వరరావు, ఎస్ సతీష్ తదితర మాజీ సైనికులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం జంక్షన్ వద్ద వల్లంపూడి ఎస్ఐ కె రాజేష్, సిబ్బంది ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ మధ్యకాలంలో పలు రకాల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణకు వాహనాలను తనిఖీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఘనంగా కళారూపాల పోటీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆదివారం ఉదయం స్థానిక కళా భారతి ఆడిటోరియంలో జిల్లా స్థాయి బాలోత్సవ్ పోటీలను యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు యం. విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో 23వ ఆనందో బ్రహ్మ ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు విద్యాసంస్థలు నుండి 135 మంది విద్యార్థులు కోలాటం, జానపద, శాస్త్రీయ నృత్యాలు, కామెడీ స్కిట్స్‌ల విభాగాల్లో పోటీ పడ్డారు. ఇందులో కోలాటం విభాగం లో బొబ్బిలి మండలం నారాయణప్ప వలస కోలాటం విద్యార్థులు ప్రథమ స్థానం పొందగా సీతానగరం మండలం గుమ్మడి వరం నకు ద్వితీయ స్థానం పొందారు. శాస్త్రీయ నృత్య విభాగంలో కృష్ణ వేణి డాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, జాన పద విభాగంలో ఎబిసి డాన్స్ అకాడెమీ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. బలిజి పెట మండలం రాముడు వలస, బాడంగి మండలం పాల్తేరు, సీతానగరం మండలం జానుమల్లు వలస టీములు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. అనంతరం ఎబిసి డాన్సు అకాడెమీ విద్యార్థులు ప్రదర్శించిన చిట్టి తల్లీ జాగ్రత్త స్కిట్, బొబ్బిలి తైక్వాండో విద్యార్థులు ప్రదర్శించిన ఆత్మరక్షణ విద్యలు ప్రేక్షకుల్ని ఆకట్టున్నాయి. విజేతలకు కళా భారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాల్, బిహెచ్ గంగాధర్, పి నాగరాజు, తాడుతూరి వెంకట రమణ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు.

వివిధ కళారూపాలలో విద్యార్థులు

గ్యాస్ లీకేజీతో భారీ పేలుడు

- ధ్వంసమైన ఇల్లు
- నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- జిల్లా కేంద్రాస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి- లక్కవరపుకోట, విజయనగరం కోట

సుమారు తెల్లవారు జామున ఐదు గంటల సమయం.. అప్పుడే గాఢ నిద్ర నుంచి తేరుకుంటున్న గ్రామస్తులకు ఒక్కసారిగా పెద్ద ఎత్తున పేలుడు శబ్దం వినిపించింది. ఏమైందో తెలియక ఆయోమయంలో పడ్డారు. గ్యాస్ సిలిండర్ పేలి ఉంటుందని గుర్తించి పరుగులు తీశారు. పెద్ద పెద్ద కేకలతో కాలిన మంటల్లో నుండి బయటకు వస్తున్న క్షతగాత్రులను గుర్తించారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.

మండలంలోని గవరవీధిలోగల ఒక ఇంటిలో పూసపాటిరేగ మండలం నుండి వలస వచ్చిన తామరాపల్లి వెంకటలక్ష్మి, ఆమె కుమార్తె కెల్ల శ్రావణి, మనవడు మోహన్, మనవరాలు లాష్యలతో కలిసి వారం రోజులు క్రితం అద్దెకు దిగారు. శనివారం రాత్రి వంట గ్యాస్ తెచ్చుకొని ఇంట్లో పెట్టుకున్నారు. వీరి నలుగురితో పాటు కెల్ల శ్రావణి అన్నయ్య కుమార్తె తామరాపల్లి ప్రవళి కూడా శనివారం రాత్రి వీరి ఇంట్లో నిద్రించింది. రాత్రి తెచ్చిన గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతో గది అంతా గ్యాస్ వ్యాపించింది. చలికాలం అవడం వల్ల తలుపులు, కిటికీలు మూసి ఉంచడంతో గ్యాస్ బయటకు పోలేదు. ఆదివారం తెల్లవారు జామున సుమారు ఐదు గంటల సమయంలో తామరాపల్లి వెంకటలక్ష్మి నిద్రలేచి లైట్ వెలిగించేందుకు స్విచ్ వేయడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గదిలో

గాయపడిన లాష్య

విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వ్యాపించిన గ్యాస్ అంటు కోవడంతో ఒక్కసారిగా పెద్ద పేలుడు శబ్దంతో గోడలు, కిటికీలు, తలుపులు ఎగిసిపడ్డాయి. మంటల్లో చిక్కుకున్న తామరాపల్లి వెంకటలక్ష్మి (50), కెల్ల శ్రావణి (30), కెల్ల మోహన్ (10), కెల్ల లాస్య (8), తామరాపల్లి ప్రవళి (7) పూర్తిగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక 108 వాహనంలో ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమించడంతో అక్కడ నుండి విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా ఆ ఇంటికి ఎదురుగా ఉన్న ఆడారి కనకమహాలక్ష్మి, ఆడారి పుష్ప, మల్ల వెంకటరావు ఇల్లులే కాకుండా పక్క ఇల్లు పోలమరశెట్టి ఈశ్వరమ్మ, వెనక ఇల్లులు పోలమరశెట్టి రాంబాబు, మధు ఇల్లుల తలుపులు, కిటికీలు విరిగిపోయి స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇంటి వెనుక భాగాన్ని ఉన్న ఒక సాల, గడ్డిమేటు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌కోట అగ్నిమాపకదళం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. పేలుడు కారణంగా ధ్వంసమైన ఇల్లు రూ.5 లక్షలతో పాటు చుట్టు పక్కల మరో ఆరు గృహాలు దెబ్బతిన్నందు వల్ల రూ. 6లక్షల ఆస్తి నష్టం ఉంటుందని ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా వెల్లడించారు.

పలువురు పరామర్శ

ప్రమాద సంఘటన తెలుసుకున్న స్థానిక తహశీల్దార్ టి కళ్యాణ చక్రవర్తి, ఆర్‌ఐ సన్యాసిరావు, వీఆర్‌ఒ గణేష్, ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఆర్ ఐ సన్యాసిరావు, వీఆర్‌ఒ గణేష్‌లు విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

ధ్వంసమైన ఇల్లు

దీక్షలకు మద్దతుగా విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలు మూడవరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిరాహార దీక్షకు మద్దతుగా ఆదివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ హాస్టల్ విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ గత మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద విద్యార్థులు చేస్తుంటే సమస్యలు పరిష్కారం చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం సిగ్గు చేటని విమర్శించారు. సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అదే సందర్భంలో సంక్షేమ హాస్టల్లో తగిన సిబ్బందిని నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలని, జూనియర్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ టీచర్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విశ్వవిద్యాలయ పనులు వెంటనే ప్రారంభించాలని, నెల్లిమర్ల నియోజవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్లతో నిరాహార దీక్ష జరుగుతుందని తెలిపారు. ఒకవైపు దీక్ష చేస్తున్న బృందంలోని సభ్యుల ఆరోగ్యం క్షీణిస్తున్నా సరే జిల్లా విద్యాశాఖ అధికారులు కనీస స్పందన లేకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఎస్ఎఫ్ఐ చెప్పున్న డిమాండ్లను నెరవేర్చి విద్యార్థులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ప్రాణాలు పణంగా పెట్టైన్నా సరే తమ డిమాండ్లను నెరవేర్చుకుంటామని హెచ్చరించారు. దీక్షలకు మద్దతుగా ఈ నెల 21 మంగళవారం జరిగే కలెక్టరేట్ ముట్టడిలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ సమస్యలను వినిపించాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళన తీవ్రతరం అవుతుందని, దానికి జిల్లా విద్యా శాఖ అధికారులు బాధ్యత వహించాలని చెప్పారు.

గజపతినగరం: విద్యారంగ సమస్యలపై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతుగా మండల కేంద్రంలో హాస్టల్ విద్యార్థులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సోమేష్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద విద్యార్థులు చేస్తుంటే సమస్యలు పరిష్కారం చేయాల్సిన అధికారులు నిమ్మకుఉ నీరెత్తనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అదే సందర్భంలో సంక్షేమ హాస్టల్లో తగిన సిబ్బందిని నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలని, జూనియర్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, గిరిజన విశ్వవిద్యాలయ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. దీక్షలకు మద్దతుగా ఈనెల 21 మంగళవారం జరిగే కలెక్టరేట్ ముట్టడిలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ సమస్యలను వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లిమర్ల : నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జరజాపుపేట గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ జె.నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షులు కడలి ప్రకాశరావు, రిటైర్డ్ హెచ్ఎం సుంకరి వాసుదేవరావు, కె.విజయశ్రీ, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

డెంకాడ: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం దిశ చట్టం గురించి స్థానిక సచివాలయ మహిళా పోలీసు మంగ వివరించారు. మహిళా సాధికారత పై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో లైబ్రేరియన్ మహేష్, హైస్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: దిశ చట్టంతో మహిళలకు రక్షణ లభిస్తుందని గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి, మహిళా కానిస్టేబుల్ సూర్యప్రభ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. దిశ చట్టంపై విద్యార్థులు, పాఠకులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలను గౌరవించాలని కోరారు.

పనులు చేస్తున్న కూలీలు

శరవేగంగా కాలువ పనులు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని శివ్వాంలో సర్పంచ్ బొక్కేల లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో పలు వీధుల్లో కాలువ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎస్సీ కాలనీలోని మధ్య వీధి, బీసీ వీధి, ప్రధాన రహదారి పక్కన కాలువ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత కొన్నేళుగా కాలువ నిర్మాణ పనులు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం కాలువ నిర్మాణ పనులు జరుగుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్మాణ పనులను వైసిపి నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు, ఏనుగుతల వెంకట నాయుడు ఆదివారం పరిశీలించారు.

గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది..?

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం, జొన్నాడ మధ్య రోడ్డులో ఆదివారం జనసేన, టిడిపి నాయకులు ఉమ్మడిగా 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది?' కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపై ర్యాలీగా వెళుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గుంతల్లో చేరిన నీటిలో పడవలు వదిలి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన నియోజకవర్గ ఇంఛార్జిలు కర్రోతు బంగార్రాజు, లోకం మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో అధ్వాన స్థితిలో ఉన్న రోడ్లపై ప్రయాణం నరకంగా ఉందన్నారు. వైసిపి ప్రజా ప్రతినిధులకు తెలిసేలాగా గుంతలు ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో సుమారు మూడు కిలోమీటర్ల పాటు నిరసనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు కంది చంద్రశేఖర్, మహంతి చిన్నంనాయుడు, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు, ఆకిరి ప్రసాద్, పోతల రాజప్పన్న, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

విజయనగరంకోట : స్థానిక జెఎన్‌టియు జంక్షన్ నుంచి కొండకరం రోడ్డు దుస్థితిపై టిడిపి, జనసేన ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఘంటా పోలినాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని, టిడిపి కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కర్రోతు నర్సింగ్ రావు, కె.శ్రీనివాసరావు, రొంగలి రామారావు, జనసేన నాయకులు రౌతు సతీష్, మాజీ సర్పంచ్ పి.సూరప్పుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : వైసిపి ప్రజాప్రతినిధులకు రోడ్ల దుస్థితి కనిపించకపోవడం సిగ్గుచేటని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. నగరంలో ఎస్‌బిటి మార్కెట్ జంక్షన్ , కంటోన్మెంట్ పోస్టాఫీస్ జంక్షన్, అయ్యన్నపేట జంక్షన్ రోడ్లపై జనసేన, టిడిపి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళీ శంకర్రావు, జనసేన నాయకులు కాటం అశ్విని, పితాల లక్ష్మి, దుప్పాడ జ్యోతి, టి.రామకృష్ణ, ఏంటి రాజేష్, ఎల్.రవితేజ, అభిలాష్, అడబాల వెంకటేష్, ఎం.పవన్ కుమార్, పృథ్వీ భార్గవ్, కె.సాయి, కంది సురేష్ కుమార్ పాల్గొన్నారు.

డెంకాడ: రోడ్డుపై పడవలను విడిచిపెడుతున్న నాయకులు

గరివిడి: వెదుళ్లవలస వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

గ్రామాల్లో ఇందిరా గాంధీ జయంతి

ప్రజాశక్తి- డెంకాడ

మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ 106 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల అధ్యక్షులు వాకాడ రమణ, అప్పల రెడ్డి, పూసపాటి రేగ మండల అధ్యక్షులు చిలక రాజు, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గరేబి హఠావో నినాదం ద్వారా బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినట్లు తెలిపారు. బ్యాంకులు జాతీయకరణ విధానం ద్వారా దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి ఆర్థిక అభివృద్ధిలో ప్రథమ పాత్రను పోషించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జి. బంగారు నాయుడు, హెచ్ నానాజీ, మెంటాడ అప్పారావు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఇందిరాగాంధీ పని చేశారని, దేశాభివృద్ధి కాంగ్రెసుతో సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌కోట: ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'గజపతినగరం సీటు వెలమలకు కేటాయించాలి'

ప్రజాశక్తి- మెంటాడ

వెలమ సామాజిక వర్గానికి గజపతినగరం ఎమ్మెల్యే స్థానాన్ని అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని రాష్ట్ర వెలమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ వెలమలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. వెలమ గర్జన జనవరి 7 తేదీన విశాఖపట్నం వేదికగా జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వెలమలకు అన్ని జిల్లాల్లో స్థలాలు కేటాయించాలని, వెలమల హక్కుల కోసం, వెలమల ఐక్యత కోసం, వెలమల ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి లక్ష్యంతో వెలమ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయం నేపథ్యంలో వెలమ సామాజిక వర్గాన్ని బిసిడి జాబితా నుంచి బిసిఎ జాబితాలోకి మార్చాలని కోరారు. వెలమ సామాజిక భవనాలకు అన్ని జిల్లాల్లో స్థలాలు కేటాయించాలని, వెలమ సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు త్వరలో జరగబోయే ఎన్నికల్లో జనాభా దామాషా పద్ధతిలో వెలమలకు ప్రాధాన్యత కల్పించి అధిక శాతం సీట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మదరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, కార్యదర్శి పెదిరెడ్ల శ్రీనివాస్ రావు, వాదాల దుర్గారావు, ఇత్తంశెట్టి నాయు, వెలమ రాష్ట్ర నాయకులు ముర్రు రాము, పట్టా శ్రీధర్, గొల్లు శ్రీనివాస్, రొంగళి చిన బాబు, కర్రి రాజేష్, నకిరెడ్డి మురళీ వెంకట శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

విద్యార్థులు ప్రతిఒక్కరూ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని నారాయణ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు తెలిపారు. ఆదివారం గాజులరేగ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి క్విజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని తమ మేధస్సుకు పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేవా గుణం గొప్పది

ప్రజాశక్తి- కొత్తవలస

సేవా గుణం చాలా గొప్పదని సేవ చేయాలని ఆలోచన ప్రతి ఒక్కరికీ రావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మండలంలోని మంగలపాలెంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవం, గురుదేవ హాస్పిటల్స్ రెండవ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్షలాది మంది వికలాంగుల ఉన్నతికి 25ఏళ్ల పాటు ట్రస్ట్ ద్వారా జగదీశ్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ట్రస్ట్‌కు ప్రభుత్వం ద్వారా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ట్రస్ట్ చేపడుతున్న సేవలకు గానూ రూ.లక్ష విరాళంగా కోలగట్ల ప్రకటించారు. గాయత్రి మెడికల్ కళాశాల, గాయత్రి హాస్పిటల్స్ సెక్రటరీ డాక్టర్ పి.సోమరాజు మాట్లాడుతూ గురుదేవ ట్రస్ట్, హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాల్లో సేవలందిస్తూ జగదీష్ యుగ సాధకుడయ్యారని కొనియాడారు. త్వరలో ఇక్కడ నర్సింగ్ కళాశాలను నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందుగా ట్రస్ట్ ప్రాంగాణంలోని అవయవ తయారీ కేంద్రాన్ని, గురుదేవ హాస్పిటల్స్‌ను కోలగట్ల సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లోని భజన, కోలాటం సంఘాల మహిళలకు చీరలు, సామాగ్రిని ట్రస్టు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, కొత్తవలస ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు మూర్యారి తాత, కుంకాల పండు, విన్నకోట రాజేష్, గురుదేవ హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ అచ్చు రామయ్య, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ ప్రియ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రఘువంశి, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ సుజాత, గురుదేవ ట్రస్ట్, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ స్వామి

CHANGE OF NAME

I, MAHIPADA MARY RATNAM (Old Name), Residing at Rajiveedhi, Rellivalasa Post, Pusapatirega Mandalam, Vizianagaram Dist. Change my name from MAHIPADA MARY RATNAM (Old Name) to **MAHIPADA SAHASRA** (New Name) hence forth I am being Called as **MAHIPADA SAHASRA** (New name) S/o.Mahipada Gopala Rao for all purpose.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.P.NO: 35/2021 IN O.S.NO: 348/2015

Between:
Dasari Saranath ....DHR
And:
Chinthaluri Nani ....JDR
To:

NOTICE

Chintaluri Nani, S/o Late Appalachari, Business, residing at D.No:25-2- 2014/A, Bondiligudem, Vizianagaram.

Please take notice that the decree holder filed the above petition against you and the above matter stands posted to **11.12.2023** for your appearance. Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10-30 A.M., on 11.12.2023** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

CH. RAMBABU
Advocate for Petitioner,
Vizianagaram